ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH

Friday, April 03, 2009



# చేవలేని పాలన లేవలేని రైతన్న

పి. వి. సుబ్బయ్యచౌదరి

**'ఇతర రంగాల విషయంలో ఎలా ఉన్నా వ్యవసాయాన్ని మాత్రం నిర్లక్ష్యం చేయరాదు' అని తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. దురదృష్టమేమిటంటే- పాలకులు ఈ రంగాన్నే చిన్నచూపు చూస్తున్నారు. దేశంలో వ్యవసాయ రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి కారణం చేవలేని పాలన, లోపభూయిష్ఠ విధానాలేనంటున్న వ్యాసమిది...**

వ్యవసాయరంగానికి తాము పెద్దపీట వేస్తున్నామని, తమది రైతురాజ్యమని కేంద్రంలోని ఐక్యప్రగతిశీల కూటమి (యు.పి.ఎ.) ప్రభుత్వం, మనరాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ పదేపదే ఉద్ఘాటిస్తుంటాయి. వ్యవసాయరంగం శీఘ్రగతిన అభివృద్ధి చెందడానికి, రైతుల ఆర్థిక స్థితిగతుల్ని మెరుగుపరచడానికి వినూత్న కార్యక్రమాలు అమలుచేస్తున్నామనీ కేంద్ర, రాష్ట్రపాలకులు చెబుతున్నారు.

ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ రెండేళ్లక్రితం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగిస్తూ- 'దేశానికి రైతులే వెన్నెముక. వారు బాగుంటేనే దేశమూ బాగుంటుంది. రైతుల సంక్షేమానికి మేము అత్యంత ప్రాధాన్యమిస్తున్నా'మని అన్నారు. రాష్ట్రాన్ని 'హరితాంధ్ర ప్రదేశ్'గా మారుస్తామంటూ తాము చేసిన వాగ్దానాలన్నిటినీ నెరవేర్చామని, రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా నిరోధించడానికి పలు చర్యలు తీసుకున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి పదేపదే చెప్పారు. ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ఈ విషయాన్నే ఏకరువు పెడుతున్నారు. అయితే, కాంగ్రెస్ పాలనలో ఏ ప్రమాణాలరీత్యా చూసినా వ్యవసాయరంగంలో ప్రగతి శూన్యమేనని, రైతుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట పడకపోగా అవి మరింత పెరిగాయని గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2004-2009 మధ్య 2,859 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారిక లెక్కలే వెల్లడిస్తున్నాయి. ఆరువేల మందికిపైగా అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నట్లు రైతు సంఘాలు అంటున్నాయి. రైతుల సంక్షేమం, వ్యవసాయరంగంలోని వివిధ విభాగాల అభివృద్ధి సాధనలో ప్రభుత్వాలు వైఫల్యానికి ఇది దృష్టాంతం.



ఆగని ఆత్మహత్యలు

వ్యవసాయరంగం, రైతుల సంక్షేమం విషయంలో తాను చేసిన వాగ్దానాలను మన రాష్ట్రప్రభుత్వం నెరవేర్చలేదు. విత్త నాల సరఫరా నుంచి, రుణ సదుపాయాల కల్పన, ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన రైతులను ఆదుకోవడం వరకు- అన్ని విషయాల్లోను రాష్ట్ర పాలకులు విఫలమయ్యారు.


సారం కోల్పోతున్న నేలలు

భూసారాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరచవలసిన అవసరాన్ని జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సంస్థలతోపాటు రైతుల సంక్షేమంపై ఏర్పాటైన కమిషన్లూ నొక్కి చెప్పాయి. మనరాష్ట్రంలో కోటీఇరవైలక్షల కమ తాలున్నాయి. వాటిలో ఒక్కశాతం కంటే తక్కువ కమతాల్లోనే వ్యవసాయ విభాగంవారు భూసార పరీక్షలు నిర్వహించినట్లు గణాంకాలు వెల్లడిస్తు న్నాయి. దీంతో- భూసారంపై తగు అవగాహనలేని కారణంగా రైతులు రసాయన ఎరువులను విపరీతంగా ఉపయోగిస్తున్నారు, పంట మార్పిళ్ల పద్ధతినీ వారు పాటించలేదు. పర్యవసానంగా పంటభూములు బాగా దెబ్బతిన్నాయి. భూసారాన్ని మెరుగుపరచడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని రాష్ట్రప్రభుత్వం చేసిన వాగ్దానం కార్యరూపం దాల్చలేదు.


విత్తులోనే విపత్తు

వ్యవసాయ ఉత్పత్తుల్ని పెంచడంలోను, ఉత్పాదనలో నాణ్యతను పరిరక్షిం చడంలోను విత్తనాలు కీలక పాత్ర పోషిస్తాయి. నాసిరకం విత్తనాలు, కల్తీ విత్త నాల వాడకం వల్ల ఓ స్థాయికి మించి దిగుబడులు రాని పరిస్థితి ఉత్పన్నమైంది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచి, దేశానికి ఆహార భద్రత కల్పించేందుకు పూర్తిగా కొత్త విత్తనాలను వాడుతుండాలని డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ నివేదికతో సహా జాతీయ, అంతర్జాతీయ సంస్థలూ సూచించాయి. కొత్త విత్తనాల వాడకం పది శాతం మాత్రమే ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో విత్తనాలకోసం రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేయవలసి వచ్చింది. సర్కారు విత్తనాలు సరఫరా చేయకపోవడంతో వారు రోడ్లపైకి వచ్చి ఆందోళన లకు దిగవలసి వచ్చింది, పోలీసుల లాఠీదెబ్బలు చవిచూడవలసిన దుస్థితి. వ్యవసాయానికి అత్యవసరమైన ఎరువులు తదితరాల విషయంలోనూ రైతులకు ఇదే దుస్థితి ఎదురైంది.


రుణాల కోసం ఇక్కట్లు

రైతులకు రుణసౌకర్యం కల్పించడం ముఖ్యం. వ్యవసాయ సంబంధిత పనులను వారు సకాలంలో పూర్తిచేయడంలో రుణాలూ కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్రంలో మూడుకోట్ల ఎకరాలు సాగులో ఉన్నాయి. వాటిలో కోటి ఎకరాలు నీటి వనరులపైన, రెండుకోట్ల ఎకరాలు వర్షాలపైన ఆధారపడిన భూములు. వ్యవసా యరంగం అవసరాల దృష్ట్యా- బ్యాంకులు దాదాపు 50వేలకోట్ల రూపాయల మేరకు వ్యవసాయరుణాలు సమకూర్చవలసి ఉంది. అన్ని బ్యాంకులు కలిపి రైతు లకు ఇచ్చిన అప్పుల మొత్తం వారి రుణావసరాల్లో కేవలం 20 నుంచి 25శాతం వరకు మాత్రమే తీర్చగలిగినవి. దీంతో మిగిలిన రుణావసరాలకోసం రైతులు అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యక్తులనుంచి

రుణాలు తెచ్చుకోక తప్పలేదు. వ్యవసాయరంగానికి వ్యవస్థాగతంగా రుణసౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం చేతులెత్తేయడంతో రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నారు. వ్యవసాయరంగ రుణావసరాలను తీర్చడంలో కీలకమైన సహకార సంఘాలు ఖాయిలాపడ్డాయి. ఈ సంఘాల పనితీరులో ప్రభుత్వ జోక్యం ఎక్కువ కావడంతో- వాటికి గల స్వయంప్రతిపత్తి హరించుకుపోయింది. తాము సమకూర్చే మొత్తం రుణాల్లో 40శాతం రుణాలను ప్రాధాన్య రంగానికి ఇవ్వాలని, ఇందులో 18శాతం రుణాలను వ్యవసాయరంగానికి ఇవ్వాలని రిజర్వుబ్యాంకు మార్గదర్శక సూత్రాలు పేర్కొంటున్నాయి. అయితే, ఏవో రెండు మూడు బ్యాంకులు తప్ప- అలా 18శాతం రుణాల్ని ఏ బ్యాంకూ రైతులకు సమకూర్చడంలేదు.



కష్టాల కడలి

నిరుడు కేంద్రప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం అమలుతీరు పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆ పథకంలో కల్పించిన మాఫీ వెసులుబాటు అయిదు ఎకరాల (రెండు హెక్టార్లు) కంటే తక్కువ ఉన్న రైతుల రుణాలకే వర్తిస్తుంది. కోస్తా జిల్లాలలో రెండు పంటలు పండే అయిదు ఎకరాల మాగాణి భూమిగల రైతుల ఆర్థిక స్థితిగతులను; అనంతపురం వంటి కరవు పీడిత ప్రాంతంలో వర్షాలపైనే ఆధారపడిన అయిదు ఎకరాల భూమిగల రైతు ఆర్థిక స్థితిగతులను ఒకేగాటన కట్టలేం. అదీగాక, 2007 మార్చి 31వతేదీ ముందు తీసుకున్న వ్యవసాయ రుణాలే ఆ పథకం కింద మాఫీ అవుతాయి. ఖరీఫ్ పంటకోసం 2006లో రుణం తీసుకుని, దాన్ని 2007 మార్చి 31లోగా తీర్చి, తిరిగి ఖరీఫ్ పంట కోసం 2007 ఏప్రిల్ ఒకటో తేదీ తరవాత కొత్తగా అప్పు తీసుకున్న రైతులకు ఆ వెసులుబాటు లభించదు. కౌలు రైతుల రుణాలు ఈ పథకం పరిధిలోకి రావు. తమ రుణాలపై చెల్లించాల్సిన వడ్డీమీద ప్రభుత్వం ప్రకటించిన రిబేటు సౌకర్యం- గడువు లోపల రుణాలు చెల్లించిన రైతులకు వర్తించదు. గడచిన దశాబ్దంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలకు పెద్దయెత్తున నష్టం వాటిల్లింది. రైతుల రుణభారం తడిసిమోపెడయింది. పంటల బీమా పథకాలు కానీ, కరవు, వరద సహాయక పథకాల కింద ప్రకటించిన ఉపశమన చర్యలు కానీ రైతుల ఆర్తిని తీర్చలేకపోయాయి. ఓ అంచనా ప్రకారం- దేశంలో ప్రతి రైతు మోస్తున్న సగటు రుణభారం 15వేల రూపాయలు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో అది 24వేల రూపాయలు! రైతులకు రుణభారంనుంచి ఉపశమనం కల్పించడానికి కేంద్రప్రభుత్వం 2004లో అమలుచేసిన పథకం సైతం వారికి ఒరగబెట్టిందేమీ లేదు. ఆర్.బి.ఐ. ప్రకటించిన ప్యాకేజీ ప్రకారం రుణాల్ని రీషెడ్యూలు చేయడంవల్ల- పదివేల రూపాయల రుణంగల రైతు రూ.27,866 చెల్లించవలసివచ్చింది.

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు దీటైన రీతిలో ధర లభించాలి. ఆ విషయంలో వాటికి నిర్ణయించే కనీస మద్దతు ధర(ఎం.ఎస్.పి.) కీలక భూమిక వహిస్తుంది. అయితే, వ్యవసాయంపై రైతులు పెడుతున్న ఖర్చుకు, వారి ఉత్పత్తులకు ప్రభుత్వం నిర్ణయిస్తున్న కనీస మద్దతు ధరకు మధ్య పొంతన ఉండటంలేదు. వ్యవసాయంలో వినియోగించే వనరుల ధరలు పెరిగాయి. ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా- ప్రస్తుత సంవత్సరానికి ఎం.ఎస్.పి. నిర్ణయించే విషయంలో ఇంతకుముందరి సంవత్సరాలకు సంబంధించిన సమాచారాన్నే కొలమానంగా తీసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు 30 నుంచి



మద్దతు ధర కరవు

50శాతందాకా ఎక్కువ ఉండేలా నిర్ణయింపజేయడం తమ ఘనతేనని రాష్ట్రప్రభుత్వం చెప్పుకొంటోంది. వ్యవసాయానికి అవసరమైన వనరుల ధరలు 300 నుంచి 400శాతం వరకు పెరిగాయని, వాటికీ, వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరల పెంపునకు మధ్య పొంతన లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



విలువ దక్కని శ్రమఫలం

మార్కెట్ యార్డుల విషయానికొస్తే- ప్రభుత్వం నియమించే కమిటీలు వాటిని నిర్వహిస్తుంటాయి. సాధారణంగా ఈ కమిటీల్లో పాలకపక్ష అనుయాయులైన స్థానిక రాజకీయ నాయకులు, వ్యాపారులు, దళారీలే సభ్యులుగా ఉంటారు. మార్కెట్ యార్డుల్లో జరిగే క్రయవిక్రయాలపై సరైన లెక్కలు ఉండవు. వ్యాపారులు ఓ సిండికేట్‌గా ఏర్పడటం, తద్వారా- రైతులు తమ ఉత్పత్తుల్ని అయినకాడికి అమ్ముకోకతప్పని పరిస్థితిని కల్పించడం మార్కెట్ యార్డులలో పరిపాటిగా మారింది. రైతులు తమ సరకుల్ని నిల్వచేసుకోవడానికి తగు వసతులు అక్కడ లేవు. విధాన నిర్ణేతల నిర్వాకమే మార్కెట్ యార్డులు ఇలా తయారుకావడానికి కారణమని రైతులు ధ్వజమెత్తుతున్నారు.

ఒకవైపు- వ్యవసాయానికి అవసరమైన వనరుల ధరలు పెరిగిపోతుండగా, మరోవైపు- రైతు పండించే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోతున్నాయి. తమ ఉత్పత్తులకు లభించే గిట్టుబాటు ధరపైనే రైతుల మనుగడ ఆధారపడి ఉంటుంది. నేటికీ గ్రామీణ జనాభాలో 70శాతం ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. 'ఆర్థికాభివృద్ధి అన్నిరంగాలకు విస్తరించలేకపోయింది. ముఖ్యంగా 1990ల తరవాత ఇటువంటి పరిస్థితి నెలకొంది. ఆ క్రమంలో- వ్యవసాయాభివృద్ధిలో వేగం మందగించి, సంక్షోభానికి దారితీసింది. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం- ఈ విపరిణామ పర్యవసానమే'నని పదకొండో పంచవర్ష ప్రణాళిక దృక్పథపత్రం పేర్కొంది. జాతీయ అభివృద్ధి మండలి (ఎన్.డి.సి.) ఆ పత్రంపై ఆమోదముద్రా వేసింది.

దేశంలో వ్యవసాయ రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి కారణం చేవలేని పాలన, లోపభూయిష్ఠ విధానాలే. అందుకే రైతులు ఇప్పుడు విధాన నిర్ణేతల వాగ్దానాలను నమ్మడంలేదు. రాష్ట్రంలోని అన్నదాతలు 'రైతు శంఖారావం' పేరిట ఆ మధ్య భారీయెత్తున నిర్వహించిన సభ- ప్రభుత్వాల తీరుపట్ల వారిలో గూడుకట్టుకున్న అసంతృప్తికి ప్రతీక. ఆ సందర్భంగా రోడ్లను దిగ్బంధం చేయడం, రైళ్లను నిలిపివేయడంవంటి చర్యలకు దిగడం ద్వారా- వారు పాలకుల విధానాల పట్ల తమ నిరసనను వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాలపై రైతులు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న రాజకీయ నాయకులను నిలదీయడానికి ఇప్పుడు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయరంగ అభివృద్ధికి, రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి కలసికట్టుగా కృషిచేయగలమని రాజకీయ నాయకులు కచ్చితమైన హామీ ఇచ్చి, దానికి కట్టుబడి ఉండేలా వారిపై ఒత్తిడి తేవడానికి రైతులు ఉద్యుక్తులు కావాలి. ఆ దిశగా వారు ఉద్యమించాల్సిన తరుణమిదే.

(రచయిత, భారతీయ రైతు సంఘాల
సమాఖ్య- సి.ఐ.ఎఫ్.ఎ. సలహాదారు)